

# గతం

యర్రంశెట్టి శాయి

అరుణాచలం బస్‌స్టాప్ చేరుకొని అక్కడ చేరిన వందలమందిలో తనూ కలిసిపోయాడు. బస్ దొరకడం ఎప్పుడూ సమస్యే అక్కడ. పది నిముషాలు గడిచిపోయింది. ఒక్క బస్ కూడా రాలేదు. విసుగ్గా పక్కకు చూశాడతను. ఆడాళ్ళ సంఖ్య కూడా ఎక్కువగానే ఉంది. హఠాత్తుగా అతని కళ్ళు తనవంకే చూస్తున్న ఓ స్త్రీమీద పడినయ్.

తృళ్ళిపడ్డాడతను.

ఎవరది....సీతేనా ?

ఆమె చటుక్కున మొహం తిప్పేసు కుంది.

అవును! సీతే. అబ్బ! ఎంతకాలానికి?

ఆరోజు తర్వాత ఆమెని చూడటం ఇదే మొదటిసారి. ఎన్ని రోజులయింది? బహుశా రెండేళ్ళు....ఉహూ, రెండేళ్ళు దాటింది. రెండేళ్ళ నాలుగు నెలలు — ఖచ్చితంగా చెప్పాలంటే రెండేళ్ళ నాలుగు నెలల పద్దెనిమిది రోజులు —

ఆమెలో ఏమయినా మార్పువచ్చిందా?

అవును! ఆమె ఇప్పుడు కొంచెం సన్నబడింది. కళ్ళు కొంచెం లోతుకు పోయినట్లున్నాయ్.

ఎందుకని ? ఆమెకు సుఖశాంతులు కరువయినాయా ? రెండో వివాహం సజావుగా సాగటంలేదా ?

పెద్ద రొదచేసుకుంటూ డబుల్‌డెకర్ వచ్చింది. అప్పటికే బయటకు వేలాడు తున్నారు జనం. అందులోనే తోసు కొంటూ చొరబడడానికి ప్రయత్నిస్తు న్నారు. తనూ ప్రయత్నించబోయాడు అరుణాచలం. అదే సమయానికి సీత కూడా ముందు కొచ్చింది. ఆ తొక్కిస లాటలో ఇద్దరూ పక్క పక్క కొచ్చేశారు.

బస్ కదిలి వెళ్ళిపోయింది.

అతనివంక చూసిందామె. ఇద్దరి కళ్లూ క్షణంసేపు కలుసుకొన్నాయ్. ఆమె మళ్ళీ వెనక్కి వెళ్ళి షెడ్‌కింద నుంచుంది. తనూ వెనక్కి నడిచాడు అరుణాచలం.

అతనివంక మరోసారి చూసింది సీత. ఆమె మనసంతా అదోలా అయి పోయింది.

ఎంతలో ఎంత మార్పు ?

అతనెందు కలా అయిపోయాడు ?

అదివరకు ఎంత స్మార్ట్‌గా ఉండే వాడు ? ఎంత హుందాగా కనిపించేవాడు?

ఎప్పుడూ స్టైల్‌గా సిగిరెట్ తాగుతూ టక్‌చేసుకొని-నీట్‌గా..

ఇప్పుడవన్నీ ఏమయిపోయినాయ్.

అతనూ రెండో వివాహం చేసు కొన్నట్లు తన కప్పుడే తెలిసింది. మరి ఆ వివాహం అతని నలా మార్చివేసిందా? సంసారం సాఫీగా సాగటం లేదా ?

ఎంత విచిత్రం!

తామిద్దరూ అలా అపరిచితుల్లా ఒకే బస్‌స్టాప్‌లో నిలబడాల్సి వస్తుందని ఎప్పుడయినా అనుకొన్నారా ? ఒకరి కొకరు సంబంధంలేకుండా ఉండాల్సి వస్తుందనీ ఒకరినొకరు ఏళ్ళ తరబడి చూసుకోకుండా గడపాల్సి వస్తుందనీ - అసలు ఊహించగలగేరా?

విధి అంటే ఇదే కాబోలు.

అతనికి తనని ఒక్క క్షణం-ఊరికే అలా పలుకరిద్దామని లేదా ?

తన ఆలోచనకు తనే సిగ్గుపడింది ఆమె.

ఎందుకు పలుకరించాలి అతను ?

పలుకరిస్తే తను మాట్లాడుతుందా? అంతకంటె విడ్డూరం ఇంకేమయినా ఉంటుందా? తనకు మాత్రం మానాభి మానాలు లేవూ?

అరగంట గడిచిపోయింది.

ఒక్క బస్ కూడా రావడంలేదు. హఠాత్తుగా ఎవరో 'ఆర్టీసీ వాళ్ళ స్ట్రైక్ జరుగుతోందిట,' అన్నారు.

అంతే జనం చెల్లాచెదరయిపోయారు.

క్షణంలో ఆ ప్రాంతంలో ఉన్న ఆటోలూ, టాక్సీలూ, రిక్షాలమీద విరుచుకు పడ్డా రందరూ.

బస్‌స్టాప్ ఖాళీ అయిపోయింది నిమషాల్లో.

కొంతమంది నడిచే బయల్దేరారు.

అరుణాచలం సీతవేపు చూశాడు. ఆమె అతనివేపు చూసింది. ఇంక అక్కడ ఉండి లాభంలేదు. నెమ్మదిగా నడువసాగిందామె. ఆమె వెనుకే అతనూ నడుస్తున్నాడు.

ఇప్పుడెక్కడుంటోందో సీత?

ఒక్కసారి తనతో మాట్లాడకూడదూ? తన ఆలోచన తనకే నచ్చటంలేదు. ఎందుకు మాట్లాడాలి? ఏం అవసరం ఉందని? ఆమె ఎవరో _ తనెవరో అంతే! అంతకంటే ఇంకేమీ బంధుత్వం లేదు తమ మధ్య. ఆ పాత చాప్టర్ క్లోజయిపోయింది. ఒకవేళ ఆమె పలుక రించినా తను మాట్లాడడు! అంతే!

ఖాళీగా వస్తోన్న ఆటోని ఇద్దరూ ఒకేసారి పిలిచారు. తీరా అది ఆగబో తూండగా ఇంకెవరో అవతలివేపునుంచి ఎక్కి కూచుని పోనీ అనేశారు.

ఇద్దరూ ఒకర ముఖా లొకరు చూసు కొన్నారు.

అతడేమయినా మాట్లాడతాడేమోనని ఆశపడిందామె. ఆమె పలుకరిస్తుందని ఎదురుచూశాడతను.

ఇద్దరూ నిరాశపడ్డారు.

మళ్ళీ ముందుకి నడక సాగించారు.

ఆమె ముందు.

ఆమెకు వెనుకే అతి సమీపంగా అతను.

చల్లని గాలి వీచింది. ఆ గాలి వెనుకే చినుకులు! ఆమె ఆకాశంవేపు చూసింది.

కొద్ది నిమిషాల్లోనే చినుకులు ఎక్కు వయిపోయినయ్.

ఓ ఫర్నిచర్ షాప్‌ముందు నిలబడ్డా రిద్దరూ. వర్షం మూలాన చాలామంది చేరారక్కడికి.

అతనికి అతి సమీపంగా నిలబడక తప్పలేదామెకి.

వర్షం పెరగటంలేదు, తరగటం లేదు. అక్కడున్నవాళ్ళు ఒక్కొక్కరే అలాగే జారుకొంటున్నారు.

హఠాత్తుగా ఓసంఘటన గుర్తుకొచ్చిం దతనికి.

మొదట్లో ఓసారి ఇలాగే-తామిద్దరూ అర్థరాత్రివరకూ వర్షం మూలాన ఓ

చోట చిక్కడిపోయారు. చీకటి! వర్షం! అక్కడ తామిద్దరే—

అప్పుడు సీతక్కూడా ఆరోజు మనసులో మెదిలింది.

ఇద్దరి మనసుల్లోనూ ప్రసన్నత చోటుచేసుకొంది.

ఇతనోసారి పలుకరిస్తే అతని గురించి ఏమయినా తెలుసుకోవాలనుంది తనకు.

అతను ఆమెవేపు చూశాడు. ఆమె పలుకరించకూడదూ! ఉహూ! ఎలా పలుకరిస్తుంది? ఎంతయినా స్త్రీ. ముందు తనే మాట్లాడడం తప్పు కాదు. చిన్న తనం కాదు. కొంచెం క్యూరియాసిటీ అంతే! ఆమె జీవితం గురించి ఏం చెబుతుందో — తెలుసుకోవాలని.

వర్షం కొంచెం తగ్గింది. పూర్తిగా ఆగిపోలేదు. అక్కడున్నవాళ్ళందరూ వెళ్ళిపోయారు. షాపులో ముసలాడు ఏదో గొణుక్కుంటున్నాడు.

"ఇప్పు డెక్కడుంటున్నావ్ సీతా!" అకస్మాత్తుగా అడిగా డతను. వెంటనే ఎందు కడిగానా అనిపించిందతనికి.

ఆమె తడబడింది. "మేధిపట్నం."

"అబ్బ! చాలా దూరమే!"

"అవును! మీ రెక్కడుంటున్నారు?" అడిగిం దామె.

"అంబర్ పేట."

"ఓహో...."

ఓ క్షణం ఇద్దరూ నిశ్శబ్దంగా ఉండి పోయారు

"మీరు పెళ్ళిచేసుకొన్నట్లు తెలిసింది," అన్నా డతను.

"అవును...."

"అతనేం చేస్తాడు?"

"మా ఆఫీస్‌లోనే చేసేవారిదివరకు. ఇప్పుడు రైల్వే...."

"అలాగా!"

"మరి మీరూ వివాహం చేసుకొన్నా రనుకొంటాను?"

"అవును."

"ఆమె చదువుకున్నదా?"

"ఉహూ! చదువు అసలు లేదు...." కావాలనే కటువుగా అన్నాడతను. ఆమె మాట్లాడలేదు.

ఒకవేళ తన మాటకు నొచ్చు కుందేమో అనుకున్నాడతను.

"మీవారు మిమ్మల్ని బాగా చూసుకుం టున్నారా?" అడిగా డతను.

"ఓ! నేనంటే అమితమయిన ప్రేమ! ఏ పనీ చేయనివ్వరు! కాలు కింద పెట్ట నివ్వరు. నన్ని ఉద్యోగం కూడా మానెయ్యమంటారు. కానీ... నాకే ఏమీ తోచదని....కంటిన్యూ చేస్తున్నాను...."

"పోనీలే!ఎప్పుడూ అలాగే ఉండాలి!" ఆ మాట తన గుండెల్లోనుంచి రాలేదని తనకు తెలుసు.

"మరి మీ సంసారం గురించి చెప్ప



రేం? ఆమె మిమ్మల్ని అర్థంచేసుకొని మసిలే తత్వంగలదేనా?"

"నా భార్య గురించి నేను చెప్తే బావుండదనుకొంటాను. తను ఎంత మంచిదో చెప్పలేను. నేనంటే ప్రాణం। ఇంతవరకూ మా మధ్య అభిప్రాయభేదమనేది రాలేదు...."

వర్షం పూర్తిగా తగ్గిపోయింది.

ఖాళీగా వస్తోన్న ఆటోను పిలిచిందామె.

దగ్గర కొచ్చి ఆగింది ఆటో.

"నేను వెళ్తానిక, గుడ్‌నైట్...." అందామె ఆటోలో కూర్చుంటూ.

"గుడ్‌నైట్...." అన్నాడతను.

ఆటో కదిలింది.

రోడ్డుమీద నడువసాగా డతను. ఆమె ఆటోలో నుంచి ఓసారి వెనుకకు తొంగి చూసింది.

అకస్మాత్తుగా ఆమె కళ్ళవెంబడి నీళ్ళు తిరిగినయ్.

తనెందుకలా అబద్ధాలు చెప్పింది. అతని దగ్గర విడాకులు తీసుకొన్నందుకు పశ్చాత్తాపపడటం లేదని తెలియజేయ డానికా ?

నిజానికి తనింట్లో జరుగుతున్న దేమిటి ? తను చెప్పిందానికి పూర్తి విరుద్ధం కాదూ ?

శ్రీరామ్ తనూ ప్రేమించుకుంటు నప్పుడే చెప్పింది తను. తను భర్తకు విడాకులిచ్చిందని, అన్నిటికీ అంగీకరించి రించి తీరా వివాహ మయాక అన్ని విషయాల్లోనూ తనను చిన్నబుచ్చి మాట్లాడడం - తనకి అతను రెండో మొగుడని పరిహసించడం - తనమీద ఏదో అనుమానం — ఓ విధమయిన హింస —

ఏం చెయ్యగలదు తను ?

అతన్నీ కాదని విడాకులు తీసుకుంటే అంతకంటే హాస్యాస్పదం ఇంకేమైనా ఉంటుందా ? అతను తనని అంగీకరించ డమే గొప్ప! కనీసం ఈ అభిప్రాయం చాలామంది కుంది.

ఒక విధంగా అరుణాచలమే నయం! ఎంత అభిప్రాయభేదాలున్నా అకాసేపే ! తరువాత అన్నీ మర్చిపోయేవాడు. కానీ శ్రీరామ్ అలాకాదు. అనుక్షణం తనవి చిత్రవధ చేస్తూనే ఉంటాడు.

ఆటో ఆమె ఇంటిముం దాగింది. కన్నీళ్ళు తుడుచుకొని లోపలకు నడిచిం దామె. తను అరుణాచలంనుంచి విడి పోయి పెద్ద తప్పు చేసింది. అయితే ఆ విషయం ఇప్పుడు తెలుసుకొని మాత్రం ఏం లాభం ?

అరుణాచలం చాలా దూరం నడిచాక గానీ రిక్షా దొరకలేదు. రిక్షావాడు అడిగి నంతకు ఒప్పుకొని ఎక్కి కూర్చున్నా డతను. మనసంతా గందరగోళంగా తయారయిందతనికి.

సీతకు విడాకులిచ్చి తను తప్పుచేశాడా?

ఏమో, అలానే అనిపిస్తోంది. సీతతో గడిపిన జీవితం కంటె ఇప్పుడు సుశీలతో గడుపుతున్న జీవితం ఏం బావుందని ? ఏం ఆనందం ఉందని ?

మీ మొదటి భార్య నెందుకు వదిలే శారు ?


ఆవిడా ఇలాగే చేసేదా? ఆవిడా ఇలాగే మాట్లాడేదా? ఆవిడా ఇలాగే....

ప్రతి విషయానికీ పోలికే! ప్రతి విషయానికీ గొడవలే!

"మీకేం? కావాలంటే నన్నూ బయటి



యువ




గ్గెంటి మరోదాన్ని కట్టుకొంటారు? దాన్నీ గెంటి ఇంకోదాన్ని.... అయినా నేనూ తెగించే ఉన్నాలెండి. మీకు అణిగి మణిగి పడివుండే రకాన్నేం కాదు. అయినా ఇది నా ఖర్మ కాకపోతే – నేను మా బావనే చేసుకొని ఉండేదాన్ని – అన్నీ కుదిరాక అతగాడు హార్ట్ ఎటాక్‌తో చనిపోయాడు...."

నరకం – నరకం – అంతే.

మరీ నరకం గురించి సీతకు చెప్పకుండా ఎందుకు దాచాడు తను? ఆమెను వదలుకొన్నందుకు ఏమాత్రం విచారపడడంలేదని తెలియజేయడానికా? ఆమె జీవితం కంటె తన జీవితం బావుందని రుజూ చేయడానికా?

రిక్షా ఇంటిముందు ఆగింది. రిక్షావాడికి డబ్బులిచ్చి ఇంట్లోకి నడిచాడతను భారంగా.

"ఇప్పుడింక ఏమనుకొని మాత్రం ఏంలాభం? ఇంత వివరంగా ఆనాడే ఆలోచించి ఉంటే...." నెమ్మదిగా ఇంటి తలుపు తట్టాడతను.